క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



వీఆర్వోను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: ఉత్తమ వీఆర్వోగా అవార్డు అందుకున్న అవసరాల కిషోర్‌ను పట్టణంలో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. స్థానిక దిబ్బలపాలెంలోని రామాలయంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కిషోర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వీఆర్వోగా కిషోర్ ఉత్తమ సేవలు అందించారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తున్న వీఆర్వో అవార్డుకు అర్హుడన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, కోరాడ ప్రసాద్, పైల విజయ్ కుమార్, పేకల జాన్, వాగు బలరామ్, దోశి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాలను రక్షించుకోవాలి



మునిగిన పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సిబ్బంది

కిర్లంపూడి: వర్షాలకు మునిగిన వరి పొలాలను రైతులు సంరక్షించుకోవాలని డీఏఏటీసీ శాస్త్రవేత్త శర్మ తెలిపారు. మండలంలోని పాలెం, సోమరాయణం పేట గ్రామాల్లో నీట మునిగిన పంటలను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, మడుల్లో నీరుపోయిన తర్వాత 20 కేజీల యూరియా, 10 కేజీల పోటాష్ కలిపిన బూస్టర్ డోస్‌ను పొలంలో పిచికారీ చేయాలన్నారు. అలాగే 3-4 రోజుల తరువాత ఒక లీటరు నీటిలో 1 గ్రాము కార్బెన్‌డజిమ్ లేదా 2 మిల్లీలీటరు హెక్సా కొనజోల్ కలిపిన ద్రావణాన్ని ఎకరానికి 200 లీటర్లు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ఎస్ పెద్దాపురం శాస్త్రవేత్త సుధీర్, ఏఓ సుధామాధురి, ఏఈఓ సురేష్, వీఏఏ విజయరాణి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తొండంగి: పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మెహర్ తెలిపారు. ఈ మేరకు హైయర్ ఎడ్యుకేషన్ నుంచి మార్గదర్శకాలు అందాయన్నారు. బీఏ ఎకనామిక్స్, బీకామ్ కంప్యూటర్స్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ కెమిస్ట్రి కోర్సులకు ఇంటర్ విద్యార్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 26లోపు ఆన్‌లైన్‌లో చేసుకునే వీలు లేని వారు స్వయంగా కళాశాల కార్యాలయం పనివేళల్లో సిబ్బందిని సంప్రదించాలన్నారు.

జగ్గంపేట: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశం కోసం మూడో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణన్ తెలిపారు. జగ్గంపేట ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్ ట్రేడ్స్ ఉన్నాయని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 26న సాయింత్రం 5లోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రింట్ కాపీతో పాటు, ఒరిజినల్ సర్టిఫికెట్స్, వాటి జెరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటో జగ్గంపేట ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఈ నంబర్లను 9440262266, 8142345444 సంప్రదించాలన్నారు.

కోనేరులో చేపలు మృత్యువాత



బలరామపురం కోనేరులో చనిపోయిన చేపలు

రౌతులపూడి: మండలంలోని బలరామపురం వినాయకుని గుడి వద్ద ఉన్న కోనేరులో కొన్ని రోజులుగా పంచాయతీ ఆధ్వర్యంలో పెంచుతున్న చేపలు బుధవారం హఠాత్తుగా మృత్యువాత పడి చెరువులో తేలియాడాయి. విషయం తెలిసిన గ్రామస్తులు చేపలను చూసి పలు అనుమానాలను వ్యక్తం చేశారు. చెరువుకు సమీపంలో ఉన్న సరుగుడు తోటలకు గడ్డిమందు కొట్టడం వల్ల వర్షాలకు చెరువులోకి చేరి మృత్యువాత పడ్డాయని అనుమానిస్తున్నారు. చెరువులో సుమారు టన్ను చేపలకు పైగా మృత్యువాత పడ్డాయని గ్రామస్తులు తెలిపారు.

ఎక్సైజ్ సిబ్బంది దాడులు

శంఖవరం: మండలంలోని రాజవరంలో బుధవారం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రేణుక ఆధ్వర్యంలో గ్రామంలోని సారా బట్టీలపై సిబ్బంది దాడులు చేశారు. దాడుల్లో 3వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్ట్ చేసి మరొకరిపై పరారీ కేసు నమోదు చేశారు. ఎవరైనా సారా తయారీ, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో ఏఈఎస్ రామకృష్ణ, సీఐ స్వామి, ఎస్సై కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

జర్నీ కాదు.. జంపింగ్!

- కోతకు గురైన ప్రధాన రహదారి
- గుంతలతో వాహనదారుల ఇబ్బందులు
- దినదిన గండంలా ప్రయాణం



ధ్వంసమైన మెట్టచింత వెళ్లే రహదారి



బురదమయంగా ఉలిగోగుల రోడ్డు



కోతకు గురైన మెట్టచింత మార్గం

ప్రత్తిపాడు రూరల్: గొప్పలు చెప్పొద్దు గోతులు పూడ్చండి. రాళ్లు తేలిన రహదారిలో ప్రయాణ అవస్థలు తీర్చండని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రోడ్లను బాగుజేస్తుందని చూసిన ప్రజలకు నిరాశే ఎదురైంది. రహదారులు గోతులమయంగా దర్శనమిస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. నడిచేందుకే నరకం చూస్తున్నారు. ఇలా నిత్యం ప్రయాణం దినదిన గండంలా మారిందని ఆందోళన చెందుతున్నారు.

ఆదమరిస్తే ప్రాణాలు గాల్లోకే

మండలంలోని మెట్టుచింత నుంచి ఉలిగోగుల వరకు ఉన్న రహదారి అధ్వానంగా ఉంది. రోడ్డు శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు, వాహనదారులు నరకం చూస్తున్నారు. దారి పొడవునా పలుచోట్ల రహదారి కోతకు గురైంది. ఎరకంపాలెం వద్ద సుబ్బారెడ్డి సాగర్ పొర్లు కాలువ వద్ద రోడ్డు కోతకు గురైంది. ఇక్కడ ఆదమర్చి ప్రయాణిస్తే ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఉంది. ఈ రోడ్డు పరిస్థితి అంత దారుణంగా ఉంది. రహదారి కోతకు గురై ఏళ్లు గడుస్తున్నా పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. అడుగడుగునా భారీ గోతులు ఏర్పడటంతో రహదారి అధ్వానంగా తయారైంది. గిరిజనులు మైదాన ప్రాంతానికి వచ్చేందుకు నిత్యం ఈ రహదారినే వినియోగిస్తారు. అలాగే ఈ రహదారి పైనే గిరిజన ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించాల్సి ఉంది. అయితే ఈ రోడ్డు బురదమయంగా మారడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఉలిగోగుల గిరిజన గ్రామంలో 37 కుటుంబాలకు చెందిన 110 మంది గిరిజనులు జీవిస్తున్నారు. తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ షాన్మోహన్ సగలికి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో గత శుక్రవారం కలెక్టర్ ఉగిగోగుల గ్రామంలో పర్యటించారు. తాగునీరు, రోడ్డు, హౌసింగ్, విద్యుత్ వంటి తదితర అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. హౌసింగ్‌కు సంబంధించి గ్రామకంఠం లేని కారణంగా ఇల్లు నిర్మించుకునేందుకు అవకాశం లేదని, ఉపాధి హామీ పనుల బిల్లులు రావాల్సి ఉందని, విద్యుత్ లైన్లు, స్తంభాల మరమ్మతులు వంటి విషయాలను గిరిజనులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఉలిగోగులకు రోడ్డు మంజూరు చేశామని, వర్షాలు తగ్గిన అనంతరం పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు నిర్దిష్ట సమయంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని గిరిజనులు కోరారు.

భయపడుతున్న గిరిజనులు

ఇ.గోకవరం నుంచి మెట్టచింత వెళ్లే రహదారి వర్షాలకు తొమ్మిదేళ్ల క్రితం కోతకు గురైంది. అప్పటి నుంచి ఈ రహదారిపై ప్రయాణించేందుకు గిరిజనులు భయపడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ రహదారిపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అత్యంత ప్రమాదకరంగా

మెట్టచింత నుంచి ఉలిగోగుల వెళ్లే రహదారి అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డు పొడవునా కోతకు గురికావడమే కాకుండా భారీ గోతులు ఏర్పడ్డాయి. వర్షం వస్తే గోతుల్లోకి నీరు చేరి అధ్వానంగా తయారవుతుంది. దీంతో వాహనదారులు, పాదచారులు వెళ్లేందుకు నరకం చూస్తున్నారు.

మరమ్మతులు కూడా చేయలేదు



ఇ.గోకవరం నుంచి మెట్టచింత వెళ్లే రహదారి ఎరకంపాలెం జలపాతం వెళ్లే రహదారికి సమీపంలో భారీగా కోతకు గురైంది. ఇక్కడ ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు ప్రవహిస్తుంది. ఇది జరిగి మూడేళ్లు అవుతున్నా అధికారులు కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస మరమ్మతులు చేయాలి.

– మేలం సీతమ్మ, ఉలిగోగుల

తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి



మెట్టచింత నుంచి ఉలిగోగిల వెళ్లే రహదారి గుండా ఎక్కడికక్కడ భారీ గోతులు ఏర్పడి కోతకు గురైంది. ఈ రహదారిపై ప్రయాణించేందుకు నరకం చూస్తున్నాం. వర్షం వస్తే వాహనాలపై వెళ్లే పరిస్థితి ఉండదు. ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

– కోసూరి గంగ, ఉలిగోగుల

నిధుల మంజూరు



ఇటీవల కలెక్టర్ షాన్మోహన్ మెట్టచింత గ్రామంలో పర్యటించి గిరిజన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీనిలో భాగంగా మెట్టచింత రహదారి పునర్నిర్మాణానికి రూ.1.80 కోట్లు ఉపాధి హామీ నిధులు మంజూరు అయ్యాయి. టెండర్ ప్రక్రియ అనంతరం రహదారి నిర్మాణ పనులను చేపడతాం.

– కుమార్ బాబు, ఎంపీడీఓ, ప్రత్తిపాడు.

కిక్కిరిసిన ఎంపీడీఓ కార్యాలయం



దివ్యాంగ పింఛన్‌దారులకు వివరణ ఇస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

తుని రూరల్: అనర్హులుగా పేర్కొంటు నోటీసులు అందుకున్న దివ్యాంగులతో బుధవారం తుని మండల పరిషత్ కార్యాలయం కిక్కిరిసిపోయింది. రెండు రోజులుగా గ్రామాల్లో సచివాలయ సిబ్బంది నోటీసులు జారీ చేస్తున్నారు. తమ పింఛన్ రద్దవుతుందన్న ఆందోళనతో దివ్యాంగులు పునఃపరిశీలన చేయాలని ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో ఎంపీపీ బొప్పన రాము, ఎంపీడీఓ కె.సాయినవీన్ మాట్లాడారు. ప్రభుత్వం పింఛన్లు తొలగించలేదని, సర్టిఫికెట్ల ఆధారంగా 40 శాతం అంగవైకల్యం ఉన్న దివ్యాంగులకు నోటీసులు ఇచ్చిందన్నారు. అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలతో అప్పీల్ చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం మండల పరిషత్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు ఇస్తే వాటిని పరిశీలించి ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి పంపించి, మరోసారి రీవెరిఫికేషన్‌కు సదరం కేంద్రానికి పంపిస్తామన్నారు. ఎప్పుడనేది తేదీలు నిర్ణయించిన విధంగా తెలియజేస్తామన్నారు. నాలుగు నెలల కిందట వెరిఫికేషన్‌లో అనర్హులుగా గుర్తించిన 572 మందికి నోటీసులు జారీ చేసినట్లు వివరించారు.

అన్నసమారాధనల ఏర్పాటు

కిర్లంపూడి: మండలంలోని తామరాడ అయ్యప్ప స్వామి, చిల్లంగి పేరంటాలమ్మ అమ్మవారి ఆలయాల్లో బుధవారం భారీ స్థాయిలో అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. స్థానిక పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

రోడ్ల నిర్మాణాన్ని విస్మరించిన కూటమి

- మాజీ మంత్రి తోట నరసింహం



బురదనీటిలో నిరసన వ్యక్తం చేస్తున్న తోట నరసింహం, శ్రీరాంజీ

కిర్లంపూడి: కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలను విస్మరించడంతో రోడ్లు అధ్వానంగా మారాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట కో-ఆర్డినేటర్ తోట నరసింహం అన్నారు. రాజుపాలెం-రామవరం రోడ్డు పూర్తిగా శిథిలావ్యవస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు తరుచు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై తోట నరసింహం స్పందించి రామచంద్రపురం రోడ్డుపై ఏర్పడిన గోతుల వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం ఆందోళన చేపట్టారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ ఆ పార్టీ నాయకులతో కలిసి గోతులలో వరినాట్లు వేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. తోట నరసింహం మాట్లాడుతూ, రాజుపాలెం నుంచి జగ్గంపేట మండలం రామవరం వెళ్లే సుమారు 14 కిలోమీటర్ల రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు పడడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇటీవల వీరవరం, తామరాడ, రామచంద్రపురం రోడ్లపై గోతుల్లో పడి ఆసుపత్రి పాలైన సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. తాను ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీగా ఉన్న సమయంలో మూడు సార్లు రోడ్డు నిర్మాణ పనులు చేశానన్నారు. రోడ్డు వెడల్పుతో పాటు వీరవరంలోని బ్రిడ్జి, పలు కల్వర్టుల నిర్మాణానికి కేంద్రాన్ని కోరగా సుమారు రూ. 32 కోట్లు నిధులు కేటాయించిదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదలైనా కాంట్రాక్టర్ అసమర్థత వల్ల పనులు నిలిచిపోయాయన్నారు. ప్రస్తుత పాలకులు గతంలో ఇదే రోడ్డుపై నిరసనలు, ధర్నాలు చేపట్టారని, ఇప్పుడు వారు అధికారంలోకి వచ్చినా రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవట్లేదని గుర్తు చేశారు. ప్రభుత్వం స్పందించి శాశ్వత రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల విభాగ నాయకులు ఆరిశ సత్యనారాయణ, పెనగంటి రాజేష్, తోట అయ్యన్న, అడబాల సుబ్బారాయుడు, ఓలేటి రాజు, పాముల చంటి, అడారి మహేష్, రాపేటి శ్రీనివాస్, బేరి బాబ్జీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్జిని కలిసిన ప్రతినిధులు



సునీతను కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రత్తిపాడు: జిల్లా జడ్జి గంధం సునీతను ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం కలిశారు. రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా జడ్జి సునీతను కలిసి, ప్రత్తిపాడు కోర్టు సమస్యలు వివరించినట్లు బార్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు తెలిపారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో అదనపు కోర్టు ఏర్పాటు, కేంటీన్, జెరాక్స్, స్టేషనరీ షాపులు ఏర్పాటు చేయాలని జడ్జిని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ ప్రతినిధులు పిల్లి బలరాములు, భారతి, వీరాస్వామి తదితరులున్నారు.

సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

ప్రత్తిపాడు రూరల్: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచి సత్ప్రవర్తన అలవర్చుకోవాలని స్థానిక ఎస్సై లక్ష్మీకాంతం అన్నారు. మండలంలోని ఉత్తరకంచి ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో బుధవారం ఈగల్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఎస్సై మాట్లాడుతూ, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. చదువుతోనే ఉన్నత స్థాయికి చేరుకోవడం సాధ్యమవుతుందన్నారు. సెల్‌ఫోన్‌ను అవసరానికి మించి వినియోగించడం వల్ల అనార్థాలకు దారి తీస్తుందన్నారు. తల్లిదండ్రులు, పాఠశాలకు పేరు తెచ్చే విధంగా విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని హితవు పలికారు. లక్ష్మీకాంతంను ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులు

ప్రత్తిపాడు: పట్టణంలో రాజీవ్ గాంధీ జయంతిని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కళా మందిర్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి కార్యకర్తలు ఘన నివాళులర్పించారు. శ్రీను మాట్లాడుతూ, దేశంలోని వివిధ రంగాలకు ప్రధానిగా ఆయన చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పన వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సూర్యప్రకాశరావు, గ్రామ కమిటీ నాయకులు కందిమళ్ల శామ్యేల్, దాసరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాల వద్ద జాగ్రత్తగా ఉండాలి



డీఈ వీరభద్రరావు

జగ్గంపేట: కొద్ది రోజులుగా వర్షాలు విస్తారంగా పడుతున్న నేపథ్యంలో ప్రజలు విద్యుత్ పరికరాల వద్ద జాగ్రత్తలు పాటించాలని జగ్గంపేట విద్యుత్ సబ్ డివిజన్ డీఈ వీరభద్రరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎలక్ట్రికల్ తీగలు ఇతర పరికరాలకు దూరంగా ఉండాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడి ఉంటే వాటిని తాకవద్దని, వెంటనే 1912 నంబర్‌కి సమాచారం ఇవ్వాలన్నారు. వర్షపు నీటితో నిండిన ప్రదేశాలు, పొలాలు, రోడ్లలో ఉన్న ఎలక్ట్రికల్ లైన్ల దగ్గర తిరగవద్దని తెలిపారు. పిల్లలు ఎలక్ట్రికల్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దగ్గర ఆడకుండా జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు. విద్యుత్ తీగలు, స్తంభాల దగ్గర గుడారాలు వేయకూడదని, తడి బట్టలు, తడి చేతులతో విద్యుత్ తీగలను తాకడం, స్విచ్‌లు వేయడం, ఆపడం చేయవద్దన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు

కోటనందూరు: స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు చిన్నారులతో పలు వ్యాయామాలు చేయించారు. రోజూ ఇంటి దగ్గర చేయించాల్సిన వ్యాయామాలు, చిన్నారులకు అందించాల్సిన పౌష్టికాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ శేఖర్ పరిశీలించారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ఏలేశ్వరం: అన్నవరం దేవస్థానంలో ఈనెల 22న జరిగే ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో మహిళలు పాల్గొనాలని సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు కోరారు. మండలంలోని పెద్దనాపల్లి, యర్రవరం, కొత్త యర్రవరం, ఏలేశ్వరంలో బుధవారం కృష్ణబాబు సామూహిక వరలక్ష్మీ వ్రతాలపై కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. వ్రతాల్లో పాల్గొనే మహిళలు పూజా సామాగ్రి తీసుకురావాలని, దేవస్థానం వారు రాగిరూపు, జాకెట్ ముక్క, ప్రసాదం, పసుపు కుంకుమ అందజేస్తారన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొవాలన్నారు.

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి సన్నిధిలో ఈనెల 22న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు లోవ దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రావణమాసం ఆఖరి శుక్రవారం కావడంతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఏర్పాటు చేశామన్నారు. వ్రతాలకు హాజరయ్యే భక్తులకు పూజా సామాగ్రి దేవస్థానం నుంచి ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. పూజలో పాల్గొన్న భక్తులకు వేదపండితుల ఆశీర్వచనం, అమ్మవారి శేషవస్త్రం (రవిక) కుంకుమ, తీర్థ ప్రసాదాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నంబరుకు 94943 81888 ఫోన్ చేసి ముందుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు.

హెల్మెట్‌తో ప్రాణానికి రక్షణ



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

కోటనందూరు: ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ప్రాణానికి రక్షణగా నిలుస్తుందని ఎస్సై రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వాహనదారులకు హెల్మెట్ ధారణపై కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే అధికశాతం ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.

మరమ్మతులు చేయించాలి

గండేపల్లి: కుట్టు మెషిన్‌లకు మరమ్మతులు చేయించాలని శిక్షణ పొందుతున్న మహిళలు ఎంపీడీఓ చంద్రరావును కోరారు. గండేపల్లిల్లో స్త్రీశక్తి భవనంలో బీసీ కార్పొరేషన్ ద్వారా జరుగుతున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. కుట్టు మెషిన్‌లు సరిగా పనిచేయట్లేదని మహిళలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రెండు నెలలుగా రావల్సిన వేతనాలు ఇప్పించాలని ట్రైనర్స్ ఎంపీడీఓను కోరారు. ఆయన మాట్లాడుతూ, మెషిన్‌లకు మరమ్మతులతో పాటు తగినంత మెటీరియల్, కత్తెర్లు, ఆయిల్, సూదులు అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ట్రైనర్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

వ్యక్తి అరెస్టు

రౌతులపూడి: గ్రామ శివారు ఏలేరు కాలువ వద్ద అక్రమంగా సారా తయారు చేస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడులు జరిపారు. ఈ దాడుల్లో రౌతులపూడికి చెందిన పోలుపర్తి వెంకటరమణ పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నామన్నారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ రాంబాబు, కానిస్టేబుల్స్ రాఘవ, హోంగార్డు వెంకటేష్ పాల్గొన్నారు.

ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

తుని రూరల్: పరిశ్రమల స్థాపనకు ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని ఇండస్ట్రీస్ డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ సందీప్ అన్నారు. బుధవారం తుని మండల సమాఖ్య కార్యాలయంలో జిల్లా పరిశ్రమల శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖలు సంయుక్తంగా ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఉచితంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, 60 ఏళ్లలోపు వారందరూ ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. డీఆర్‌డీఏ ఏపీడీ జిలానీ, ఏపీఎం అనీల్, శ్రీనివాస్, ఎంఎస్ ప్రెసిడెంట్ పద్మ, ఎంఎస్ ఏపీఎం వై.సత్తిబాబు, వీఓలు పాల్గొన్నారు.

స్టార్టప్‌లకు అభినందనలు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థుల స్టార్టప్‌లకు అభినందనలు లభించాయని యూనివర్సిటీ ఛాన్సలర్ శేషారెడ్డి తెలిపారు. బుధవారం రాజమండ్రిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తమ యూనివర్సిటీ విద్యార్థులు స్టార్టప్‌ల ప్రదర్శనలు అద్భుతంగా ఉన్నాయన్నారు. విద్యార్థుల సృజనాత్మకతను తూర్పుగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కలెక్టర్ ప్రశాంతి మెచ్చుకున్నారన్నారు.

ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధి కోల్పోతున్నాం

కిర్లంపూడి: కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్లకు ఆర్టీసీలో ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్మీ గణపతి ఆటో యూనియన్ ప్రెసిడెంట్ మర్రా చిట్టిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఏనుగు వీధి సెంటర్‌లో యూనియన్ సభ్యులు బుధవారం మానవహారం చేపట్టారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ సాయికిరణ్‌కు అందజేశారు. స్త్రీశక్తి పథకం ద్వారా ఆటో కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వాహన మిత్ర రూ.15 వేలు విడుదల చేయాలన్నారు. ఆటో డ్రైవర్స్ అండ్ మోటర్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును అమలు చేయాలన్నారు. జాతీయ బ్యాంకుల ద్వారా పావలా వడ్డీకి రుణాలు మంజూరుతో పాటు తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. యూనియన్ సభ్యులు బర్రె సింహాచలం, అడారి కుమార్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడిలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబాలకు బుధవారం దైవకృప సన్నిధి వ్యవస్థాపకుడు ఫాస్టర్ జగదీష్ ఆర్థిక సాయం అందించారు. ఒక్కొక్క బాధిత కుటుంబానికి రూ.5 వేలు చొప్పున రూ. 25 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బుర్రి శ్రీను, చనిబోయిన సత్తిబాబు తదితరులున్నారు.

దోమకాటు ప్రాణాంతకం



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఏలేశ్వరం: వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించారు. సర్ రోనాల్డ్ రాస్ అనే బ్రిటీష్ శాస్త్రవేత్త మలేరియా వ్యాధి కలగజేసేది దోమ అని పరిశోధన ద్వారా కొనుగొన్న తేదీని ప్రపంచ దోమల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. అర్బన్ పీహెచ్‌సీ వైద్యురాలు సౌభాగ్య సరోజ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మలేరియా, డెంగీ, ఫైలేరియా వ్యాధులు దోమల ద్వారా వస్తాయన్నారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు దోమ తెరలను వాడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాచపల్లిలో..

ప్రత్తిపాడు రూరల్: పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలు పెరిగి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని రాచపల్లి వైద్యాధికారి ఉషశ్రీ అన్నారు. మండలంలోని రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలో దోమల నివారణకు తీసుకోవల్సిన చర్యలను వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల సంతతిని తగ్గించుకోవచ్చన్నారు. ఆడ అనాఫిలిస్ దోమలు మలేరియా వ్యాధిని ఒకరి నుంచి మరొకరికి వ్యాపింపజేస్తాయన్నారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోధకాలు వంటి వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వీరన్న, ల్యాబ్ టెక్నీషియన్ అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ

గోకవరం: ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోకవరంలో వైద్య సిబ్బంది విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కొత్తపల్లి వైద్యాధికారులు డాక్టర్ తిరస్, డాక్టర్ నిఖిత ఆధ్వర్యంలో స్థానిక దాసరి తమ్మన్నదొర ఒకేషన్ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి దోమల నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తిరస్, నిఖిత దోమలు నిర్మూలన, పరిసరాల పారిశుభ్రత, డెంగీ, మలేరియా వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పవన్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. గోకవరంలో ఎంపీడీఓ గోవిందు మండల పరిషత్ కార్యాలయం పరిసర ప్రాంతంలోని కొలనులో గంబుజియా చేపలను విడిచారు.

గోకవరం: దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల అంతానికి పీఎంపీలు కృషి చేయాలని పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకర్‌రావు అన్నారు. గోకవరం కేర్ హాస్పిటల్ ఆవరణలో వైద్య విజ్ఞాన సదస్సు, దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ, దోమల ద్వారా సంక్రమించే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంలో పీఎంపీలు ప్రముఖ పాత్ర వహించాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

శంఖవరం: ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని అన్నవరం పోలీసులు, సివిల్ సప్లయి అధికారులు పట్టుకున్నారు. శంఖవరం గ్రామానికి చెందిన కాళ్ల సత్యనారాయణ తన ఇంట్లో 429 కేజీల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేశాడు. దాన్ని చుట్టుపక్కల గృహాలు, గ్రామాల నుంచి కొనుగోలు చేశాడు. దీంతో అధికారులు దాడి చేసి, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు అన్నవరం ఎస్సై జి.హరిబాబు తెలిపారు.

రేషన్ షాపుల తనిఖీ

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో రేషన్ షాపులను తూర్పుగోదావరి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పార్వతి బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో రెండు రేషన్ షాపులను తనిఖీ చేయగా ఒక షాపులో సరుకు నిల్వల్లో అవకతవకలను గుర్తించి చర్యలకు ఆదేశించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో ఎమ్ఎస్ఓ శాంతిప్రియ, వీఆర్వో లంకా అప్పారావు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ పునరుద్ధరణకు మరో అవకాశం

గండేపల్లి: పింఛన్ పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించినట్లు ఎంపీడీఓ కె.చంద్రరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి వివిధ తేదీల్లో రీవెరిఫికేషన్ చేసిన దివ్యాంగుల పింఛన్‌లలో 133 మందిని వివిధ కారణాలతో అనార్హులుగా గుర్తించి పింఛన్లు నిలుపుదల చేస్తు నోటీసులు జారీ చేశారన్నారు. పింఛన్ పునరుద్ధరణ కోసం ఎంపీపీ కార్యాలయం వద్ద రీవెరిఫికేషన్ కోసం 30 రోజుల్లో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్, సదరం సర్టిఫికెట్స్ జిరాక్స్‌తో పాటు లబ్ధిదారులకు అందిన నోటీసును జతపరిచి అందజేయాలన్నారు.